సాక్షి ఒడిశా
శనివారం । 21 । జూన్ । 2025



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు : రూ. 1.30.146
బంగారం : 150 మిల్లీ గ్రాములు
వెండి : 18 గ్రాముల 600 మిల్లీ గ్రాములు
- భువనేశ్వర్/పూరీ



రాష్ట్రంలో సుపరిపాలన

రాష్ట్రంలో సుపరిపాలన అందుతోందని ప్రధాని అన్నారు. తొలి వార్షికోత్సవంలో ఆయన పాల్గొన్నారు. - 8లో



కార్యకర్తల అరెస్టు

కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులను అరెస్టు చేశారు. రాత్రికి రాత్రే అరెస్టులు చేశారు. - 8లో

న్యూస్‌రీల్



రాహుల్ గాంధీ పేరిట పూజలు

లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా స్థానిక ఏకామ్ర క్షేత్రం లింగ రాజు దేవస్థానంలో శుక్రవారం ప్రత్యేకంగా పూజాదులు నిర్వహించారు. ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు భక్త చరణ్ దాస్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి అజయ్ కుమార్ లల్లు, రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రంజిత్ పాత్రోతదితర ప్రముఖులు పాల్గొని ప్రియతమ నాయకుని పరిపూర్ణ ఆరోగ్యం కోసం ప్రార్థించినట్లు తెలిపారు.
- భువనేశ్వర్

రాయగడలో వికాస్ మేళా



ర్యాలీ ప్రారంభిస్తున్న కలెక్టర్ నవీన్‌చంద్ర నాయక్

రాయగడ: రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా జిల్లా యంత్రాంగం వికాస్ ర్యాలీని శుక్రవారం నిర్వహించింది. స్థానిక సాయి ఇంటర్నేషనల్ కూడలి నుంచి శుక్రవారం ఉదయం జిల్లా అదనపు కలెక్టర్ నవీన్ చంద్ర నాయక్ ర్యాలీని పచ్చజెండా ఊపి ప్రారంభించారు. పుర వీధుల గుండా నిర్వహించిన ర్యాలీ స్థానిక మజ్జిగౌరి మందిరం వరకు చేరుకుంది. జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహక అధికారి అక్షయ కుమార్ ఖెముండో మహిళా కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ముంబైకి నవీన్ పట్నాయక్ పయనం



నవీన్ నివాస్ ఆవరణలో మంగళ హారతులతో ఆయురారోగ్యాల కోసం ప్రార్థించిన ఆత్మీయులు

భువనేశ్వర్: రాష్ట్ర విపక్ష నేత, బిజూ జనతా దళ్ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ చికిత్స కోసం శుక్రవారం ముంబైకి బయల్దేరారు. ఆయన ఆయురారోగ్యాలతో క్షేమంగా తిరిగి రావాలని ఆత్మీయంగా వీడ్కోలు పలికారు. నవీన్ పట్నాయక్ అభిమానులు, శ్రేయోభిలాషులు, అనుచరులు పెద్ద సంఖ్యలో నివాసం దగ్గరకు తరలి వచ్చారు. నవీన్ నివాస్ ముంగిట్లో మంగళ హారతులతో శ్రీ జగన్నాథుని అంగ వస్త్రం కప్పి క్షేమంగా తిరిగి రావాలని భగవంతుని వేడుకున్నారు. ఈ సందర్భంగా నవీన్ నివాస్ పరిసరాలు శంఖ ధ్వనితో మారు మోగాయి. బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం ఆవరణలో అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై నవీన్ పట్నాయక్‌ని సాగనంపారు.



మహిళల శంఖ ధ్వని

జిల్లా	ప్రాంతం	వర్షపాతం (మిల్లీ మీటర్లు)
మయూర్‌భంజ్	నవానా	81.4
సుందరగడ్	టంగరాపల్లి	76.8
సంబలపూర్	బమరా	68.2
మయూర్‌భంజ్	తిరింగ్	63.4
సుందరగడ్	కుత్ర	61.6
సుందరగడ్	గురుండియా	59.0
మయూర్‌భంజ్	బొహొల్డా	57.6
సుందరగడ్	లెహిరిపొడా	57.1
సుందరగడ్	సుందరగడ్	56.6
నవరంపూర్	డాబుగాంవ్	55.2
సుందరగడ్	బొణైగడ్	53.6
సుందరగడ్	లొహుణిపొడా	52.0
సుందరగడ్	పాన్‌పోష్	50.0



రూర్కెలా ప్రాంతంలో జల దిగ్బంధంలో జనులు

ఉప్పొంగుతున్న నదులు

• జల దిగ్బంధంలో జనులు



ఉప్పొంగుతున్న సువర్ణ రేఖ నది

భువనేశ్వర్: రాష్ట్రంలో అకస్మాత్తుగా నదుల్లో నీటి మట్టం పెరిగింది. వరద నీటి ప్రవాహంతో నదులు ఉప్పొంగుతున్నాయి. గురువారం రాత్రి నుంచి పలు చోట్ల తెరిపి లేకుండా కురుస్తున్న వానల ప్రభావంతో నదుల్లో నీటి మట్టం పెరుగుతోంది. ప్రధానంగా సువర్ణ రేఖ నది వరద నీటితో ఉప్పొంగుతోంది. ఈ సంవత్సరం తొలి వరద నీరు సువర్ణ రేఖలోకి చేరింది. ఎగువ ప్రాంతాలలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గలుడిహి బ్యారేజీ 2 లక్షల 42 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో నది నీటి మట్టం పెరుగుతోంది. దీంతో ఈ నది ప్రమాద పరిమితి మించింది. ప్రతి గంటకు పెరుగుతున్న మట్టంతో వరద నీరు పొంగి పొర్లుతోంది. నీటి పారుదల శాఖ నది గట్టు పట్టుపై నిఘా వేసి ఉంది. రాజ్‌ఘాట్ వద్ద శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు సువర్ణ రేఖ ప్రమాద సంకేతం 9.45 మీటర్ల పైన ఉంది. గంటకు 50 సెంటీ మీటర్లు వంతున ఉప్పొంగుతుంది.

సుందర్‌గఢ్ జిల్లాలో భారీ వర్షాలు

సుందర్‌గఢ్ జిల్లాలో గత రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేని వానలు కురుస్తున్నాయి. బ్రాహ్మణి నది ఎగువ పరీవాహక ప్రాంతాలలో గురువారం రాత్రి తెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాల కారణంగా నీటి మట్టం ఒక్కసారిగా పెరిగింది. రూర్కెలా ప్రాంతం వరద ముంపుతో తల్లడిల్లుతుంది. రూర్కెలా బాలూ ఘాట్ ప్రాంతంలో అనేక ఇళ్లలోకి వరద నీరు చొరబడింది. ఈ ముంపుతో 30కి పైగా కుటుంబాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నట్లు సమాచారం. వరద నీటిలో ఇళ్లు మునిగిపోవడంతో స్థానికులు పాఠశాల భవనాల్లో తాత్కాలిక ఆశ్రయం పొందారు. రూర్కెలా మునిసిపల్ కార్పొరేషన్ (ఆర్ఎంసీ) బాధిత కుటుంబాలకు పొడి ఆహారం, ఇతర అవసరమైన వస్తువులను పంపిణీ చేసి ఆదుకుంది. లోతట్టు ప్రాంతాల్లో చిక్కుకున్న వారికి ఉపశమనం కల్పించే ప్రయత్నాల్లో యంత్రాంగం కృషి చేస్తుంది. భారీ వర్షాలతో బాలూ ఘాట్, సర్దార్ బస్తీ వంటి ఇతర ప్రాంతాలు ప్రభావితమయ్యాయి. నగరంలోని కొన్ని ప్రధాన రహదారులు జలమయమయ్యాయి, అనేక మార్గాల్లో చెట్లు కూలిపోయాయి. రౌర్కెలా మున్సిపల్ కార్పొరేషన్ బృందాలు సహాయక, పునరుద్ధరణ కార్యకలాపాల్లో తలమునకలవుతున్నారు. ఇళ్లలో చొరబడిన వరద నీరు తొలగింపు, పడిపోయిన చెట్లను తొలగించడంలో ఈ వర్గాలు చురుగ్గా పని చేస్తున్నాయి.

రాష్ట్రంలో పెరిగిన సగటు వర్షపాతం

ఈ నెలలో రుతు పవనాల వర్షపాతం పుంజుకున్నట్లు ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ ఏడాది జూన్ 1 నుంచి 20వ తేదీ వరకు నమోదైన రుతుపవనాల కాలానుగుణ సంచిత వర్షపాతం సాధారణం కంటే అధికంగా రికార్డయ్యింది. ఈ నెల తొలి 20 రోజుల్లో సాధారణ వర్షపాతం 114.9 మిల్లీ మీటర్లు కాగా వాస్తవ వర్షపాతం 120.3 మిల్లీ మీటర్లు నమోదైంది.

ఈ వ్యవధిలో 2 జిల్లాల్లో అత్యధిక వర్షపాతం, 6 జిల్లాల్లో అధిక వర్షపాతం, 15 జిల్లాల్లో సాధారణ వర్షపాతం, 6 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదు కాగా మిగిలినవి ఒక్క జిల్లాలో అధిక లోటు వర్షపాతం నమోదు అయినట్లు వాతావరణ శాఖ సమాచారం. ఈ నెల 21వ తేదీ వరకు సుందరగడ్ జిల్లాకు భారీ వర్ష సూచన జారీ అయింది. ఈ వ్యవధిలో 7 నుంచి 11 సెంటీ మీటర్లు వరకు వర్షపాతం సంకేతాల్ని భారత వాతావరణ శాఖ శుక్రవారం జారీ చేసింది. గత 24 గంటల్లో సుందరగడ్ మరియు మయూర్‌భంజ్ జిల్లాల్లో అనేక చోట్ల 50 మిల్లీ మీటర్లు పైబడి వర్షపాతం నమోదైంది.

లక్ష్య సాధనకు విద్య కీలక మాధ్యమం: గవర్నరు



రాజ్ భవన్‌ను సందర్శించిన గిరిజన విద్యార్థుల బృందం



గిరిజన విద్యార్థులతో గవర్నర్ సంభాషణ

భువనేశ్వర్: యువత జీవితంలో స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని కలల్ని సాకారం చేసుకునేందుకు విద్య అత్యంత శక్తివంతమైన మాధ్యమంగా రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరి బాబు కంభంపాటి పేర్కొన్నారు. విద్య వ్యక్తిగతంగా శక్తివంతం చేయడమే కాకుండా సమగ్ర సమాజ అభ్యున్నతికి దోహదపడుతుందని గిరిజన విద్యార్థుల్ని ఆయన ప్రోత్సహించారు. గిరిజనుల హక్కులు, వారి సంక్షేమం కోసం ఉద్దేశించిన వివిధ ప్రభుత్వ కార్యక్రమాలను విద్యార్థులు అర్థం చేసుకుని అవగాహన వ్యాప్తి చేయడం ద్వారా సమాజంలోని ఇతరులు ఈ పథకాల నుంచి ప్రయోజనం పొందగలుగుతారు. గిరిజన విద్యార్థులు ఈ దిశలో కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. అవగాహన సందర్శన పర్యటనలో భాగంగా గిరిజన విద్యార్థుల బృందం స్థానిక రాజ్ భవన్ సందర్శించింది. ఈ సందర్భంగా రాజ్ భవన్‌పాత అభిషేక్ హాల్‌లో గవర్నరు వారితో సంభాషించారు. పర్యటన పురస్కరించుకుని విద్యార్థుల అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. 14 జిల్లాల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా వివిధ కళాశాలల్లో చదువుతున్న ప్లస్ టూ, ప్లస్ త్రీ, పోస్ట్ గ్రాడ్యుయేట్ స్థాయిలకు చెందిన 72 మంది గిరిజన విద్యార్థులు రాజ్ భవన్‌ను సందర్శించారు. ఈ బృందంతో గవర్నర్ ముఖాముఖి సంభాషించారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు షెడ్యూల్డ్ తెగల కోసం ఉద్దేశించిన వివిధ సంక్షేమ పథకాల గురించి గిరిజన విద్యార్థులు క్షుణ్ణంగా తెలుసుకుని వారి వర్గాలలో ఈ కార్యక్రమాల గురించి అవగాహన కల్పించాలని రాష్ట్ర గవర్నర్ ఈ సందర్భంగా కోరారు. విద్యా సంస్థలు, ప్రభుత్వ ఉద్యోగాలలో షెడ్యూల్డ్ తెగలకు అందుబాటులో ఉన్న రిజర్వేషన్ శాతం గురించి విద్యార్థులకు తెలుసా అని కూడా ఆయన అడిగి తెలుసుకున్నారు, ఈ అవకాశాలను ఉపయోగించుకోవడం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు.

ఎన్నికల హామీలు ఏమయ్యాయి..?



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దాశరథి గొమాంగో

పర్లాకిమిడి: ఏడాది పాలన పూర్తి చేసుకున్నామని వికాస్ ఉత్సవాలు చేసుకుంటున్న బీజేపీ రాష్ట్రంలోని ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయలేదని డీసీసీ అధ్యక్షుడు, మోహనా ఎమ్మెల్యే దాశరథి గొమాంగో అన్నారు. స్థానిక తెలుగు సొండివీధిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని చిట్‌ఫండ్ నేరస్తులను అరెస్టు చేస్తామని చెప్పిన ఎన్నికల హామీ ఏమైందని ప్రశ్నించారు. ధాన్యం కొనుగోళ్ల కేంద్రాల్లో గత ప్రభుత్వం 5 నుంచి 6 కిలోలు ధాన్యం కోత విధిస్తుండగా, ఈ ప్రభుత్వం వచ్చాక 8 నుంచి 9 కిలోల వెయిటేజ్ కోత విధిస్తున్నారని మండిపడ్డారు. మహిళలకు అందిస్తున్న సుభద్ర పథకం కింద రూ.50 వేల వోచర్లు ఇస్తామని చెప్పి, రూ.10 వేలు అకౌంట్‌లో వేసి అన్ని జిల్లాల్లో వికాస్ మేళా నిర్వహిస్తున్నారని ఎద్దేవా చేశారు. పశ్చిమ ఒడిశాలో సమగ్ర ఇండస్ట్రియల్ పార్క్ నిర్మాణం చేసి 51 వేల మందికి ఉద్యోగాలు కలిస్తామని ఇచ్చిన హామీ నిలబెట్టుకోలేకపోయారని విమర్శించారు. రాష్ట్రంలో పేదలకు 300 యూనిట్ల వరకూ ఉచితంగా కరెంటు అందిస్తామని హామీ ఇచ్చారు కానీ, అది ఇంతవరకూ అమలు కాలేదని దుయ్యబట్టారు. ఒడిశా పీసీసీ అధ్యక్షుడు భక్తచరణ్ దాస్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ తరపున పోరాడతామని తెలియజేశారు. ఆయనతో పాటు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బసంత పండా, అభిమన్యు పండా (మాజీ కౌన్సిలర్), మహిళా కాంగ్రెస్ నాయకురాలు జాస్మిన్ షేక్, రంజితా పాణి, పురపాలక సంఘం మాజీ వైస్ చైర్మన్ సంజయ్ అధికారి, సంగ్రాం సాహు, బిష్ణుదాస్ తదితరులు పాల్గొన్నారు.

ల్యాంప్స్ అక్రమాలపై చర్యలు తీసుకోండి

• కాంగ్రెస్ నాయకుల డిమాండ్



నబరంగ్‌పూర్ జిల్లా కలెక్టర్‌తో చర్చలు జరుపుతున్న కాంగ్రెస్ నాయకులు



మీడియాతో మాట్లాడుతున్న డాక్టర్ లిఫికా మజ్జి

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా పపడాహండి సమితి మైదల్‌పూర్ ల్యాంప్స్ (ప్రభుత్వ రైతుల సహకార సంస్థ)లో అక్రమాలపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. శుక్రవారం ఆ ప్రాంత జిల్లా పరిషత్ సభ్యురాలు డాక్టర్ లిఫికా మజ్జి కలక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ శుభంకర్ మహాపాత్రోతో భేటీ అయ్యారు. రైతులకు సహాయం చేయాల్సిన ల్యాంప్స్ ఎండీ అనేక అక్రమాలకు పాల్పడుతున్నాడరన్నారు. తాను ఈ ల్యాంప్స్‌లో జరుగుతున్న అనేక కార్యకలాలపాలపై వివరాలు అడుగుతూ లేఖలు రాసినప్పటికీ పట్టించుకోలేదన్నారు. తమ ప్రాంత రైతులు తన వద్దకు వచ్చి ఎన్నో అక్రమాలు వివరించాని ఆమె కలెక్టర్‌కి ఆధారాలతో సమర్పించారు. ఇప్పటికే ల్యాంప్స్‌లో రెండు వర్గాలుగా మారి మీడియా ముందుకు వచ్చిన విషయాన్ని లిఫికా వివరించారు. ఆమె ఫిర్యాదుపై చర్యలు చేపడతామని కలెక్టర్ హామీ ఇచ్చారు. లిఫికా వెంట మాజీ ఎంఎల్ఏ భుజబల్ మజ్జి ఉన్నారు.

40 లీటర్ల నాటుసారా స్వాధీనం



నాటుసారాతో అరెస్టైన నిందితులు

రాయగడ: పికప్ వ్యాన్‌లో నాటుసారాను అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను గుణుపూర్ ఆదర్శ పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి వారి నుంచి 40 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టైన వ్యక్తులు గుణుపూర్‌లోని దండావీధికి చెందిన పతీక కరణ్, డి.సిహాంద్రిలుగా గుర్తించారు. ఎప్పటిలాగే పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో పికప్ వ్యాన్ వేగంగా వెళ్తుండడంతో గమనించి దానిని వెంబడించారు. గడియాబంక్ సమీపంలో పట్టుకుని నిందితులను కోర్టుకు తరలించారు.

నిరంజన్ రథ్ కన్నుమూత



నిరంజన్ రథ్

భువనేశ్వర్: లోకసేవక్ మండల్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు, స్థానిక ప్రముఖ దిన పత్రిక సమాజ్ ప్రచురణకర్త, సంపాదకుడు, ప్రముఖ సామాజిక కార్యకర్త నిరంజన్ రథ్ (75) శుక్రవారం కన్నుమూశారు. కటక్ నగరం ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతు తుది శ్వాస విడిచారు. ఆయన గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారు. ఆయన మరణంపై గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. సామాజిక సేవా రంగంలో ఆయన అంకితభావం చిరస్మరణీయమని శ్రద్ధాంజలి ఘటించారు.

కొలుకుంటున్న జగన్నాథుడు

• నేడు దశ మూలికల గుళికల సమర్పణ



చక్కా విజేలో దేవతా త్రయం



జగన్నాథుని కోసం సిద్ధం చేసిన దశ మూలికల గుళికలు



దశ మూలికల గుళికల తయారీలో రాజ వైద్య కుటుంబీకులు

భువనేశ్వర్: జ్యేష్ఠ పూర్ణిమ నుంచి అస్వస్థతకు గురైన శ్రీ జగన్నాథుడు తెర చాటున గోప్యంగా వైద్య సేవలు పొందుతున్నాడు. స్వామి ఆరోగ్యం క్రమంగా కుదుటపడుతోంది. మరో వైపు యాత్ర దగ్గర పడుతుంది. స్వామి ఆగమనం కోసం భక్త జనం నిరీక్షిస్తోంది. రాజ వైద్యుల ప్రత్యక్ష పర్యవేక్షణలో రాత్రింబవళ్లు ఉపచారాలు చేస్తున్నారు. శుక్రవారం పవిత్ర అనవసర దశమి సందర్భంగా శ్రీ మందిరంలో చక్కా విజే సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా మూల విరాటుల్ని రాతి పీఠంపైకి తరలించారు. ఇది స్వామి ఆరోగ్యం కోలుకుంటున్నట్లు సంకేతం. భోగ మండప సేవ పూర్తి అయిన తరువాత జయ, విజయ ద్వారం మూసివేసి బెహరణ్ ద్వారం తెరిచారు. ధుకుడి ద్వారం సమీపంలో ఉన్న మూడు స్తంభాకార పీఠాలను గోప్య సేవల ప్రాంగణానికి తరలించి వాటిపై మూల విరాట్లను పూజించడం చక్కా విజే సేవగా పేర్కొంటారు.

దశ మూల మోదకాల వైద్యం

ఆయుర్వేద పద్ధతులు, గ్రంథాల ప్రకారం జగతి నాథునికి వైద్యం కొనసాగుతుంది. ఆరోగ్య స్థితిగతులకు అనుగుణంగా వైద్య శైలిని సమయోచితంగా సవరించుకుని ఔషధీయ పదార్థాల్ని నివేదిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం స్వామి కోసం దశ మూలికల మోదకం తయారు చేశారు. శ్రీ మందిరం రాజ వైద్య సేవకులు తరతరాలుగా మహా ప్రభువుని సేవిస్తున్నారు. ఈ మహా ఔషధిని సిద్ధం చేయడంలో పది రకాల ఔషధీయ మూలికల్ని వినియోగించడం విశేషం. ఈ మిశ్రమంతో తయారు చేసిన ఔషధాన్ని వేర్వేరుగా 3 మట్టి పాత్రల్లో పేర్చి వాటిపై కర్పూరం చల్లి మూతబెట్టి శ్రీ మందిరంలో గోప్య సేవలు అందజేస్తున్న వర్గాలకు అందజేశారు. ఆషాఢ కృష్ణ పక్ష దశమి రోజున మూడు రాతి పీఠాలపైకి చేర్చిన మర్నాడు సంప్రదాయం ప్రకారం దేవ దేవుళ్ల కోసం రాజ వైద్యుల కుటుంబీకులు తయారు చేసిన దశ మూలికల ఔషధాన్ని వైద్యంలో భాగంగా నివేదిస్తారు. ఆషాఢ కృష్ణ పక్ష ఏకాదశి నాడు మూల విరాటులకు పతి మహాపాత్రో వర్గం సేవకులు వీటిని సమర్పిస్తారు. పవిత్ర ఏకాదశి తిథి నాడు రాత్రి పూట ఆలయ వైద్యుడి సలహా మేరకు పతి మహాపాత్రో సేవకులు వీటిని సమర్పిస్తారు.

ప్రకృతి వైపరీత్యాలు ఎదుర్కొనేలా మాక్‌డ్రిల్



సత్‌రంగ్ గ్రామంలో ప్రకృతి వైపరీత్యాలు ఎదుర్కొనేందుకు సమావేశంలో పాల్గొన్న బీడీఓ తదితరులు



అగ్ని మాపక సిబ్బందితో మాక్‌డ్రిల్ ప్రదర్శన



ప్రకృతి విపత్తుల నుంచి రక్షించే సూచనలు



వంట గ్యాస్ అగ్ని ప్రమాదం నుంచి రక్షణ ఏర్పాట్లు

జయపురం: జయపురం సబ్‌డివిజన్ కొట్‌పాడ్ సమితి సత్‌రంగ్ గ్రామంలో వరద ప్రమాద బాధితుల పునరావాస ఆశ్రమంలో ప్రకృతి వైపరీత్యాలు ఎదుర్కొనేలా మాక్‌డ్రిల్ నిర్వహించారు. కొట్‌పాడ్ సమితి బీడీఓ సంధ్యారాణి సమరత్ అధ్యక్షతన ముందస్తు జాగ్రత్తలపై వివరించారు. ప్రజలను రక్షించేందుకు వినియోగించే యంత్ర సామగ్రి, ఇతర సామగ్రిని ప్రదర్శించారు. వాటిని ఎలా వినియోగించాలో మాక్‌డ్రిల్ చేసి చూపించారు. కార్యక్రమంలో సీడీపీఓ శ్రీమతి సుమిత్ర దేవి త్రిపాఠీ పిఇఓలు అజిత్ కుమార్ నాయిక్, సుధాంశు రథ్, రంజిత్ నాయిక్, గణేష్ కులదీప్, రశ్మితా దాస్, మురళీ పట్నాయిక్, మమత భొత్ర తదితరులు పాల్గొన్నారు.

కొరాపుట్: ప్రకృతి విపత్తులపై శుక్రవారం కొరాపుట్ జిల్లా జయపూర్ సబ్ డివిజన్ బలియా గ్రామ పంచాయతీ లోని తుఫాన్ విపత్తుల రక్షణ భవనం వద్ద మాక్‌డ్రిల్ నిర్వహించారు. గ్యాస్ సిలెండర్ అగ్ని ప్రమాదం నుంచి ఎలా తప్పించుకోవాలో చూపించారు. సీపీఆర్‌పై గిరిజనులకు అవగాహన కల్పించారు.

క్లుప్తంగా

నేడు యోగా దినోత్సవం



యోగా సాధన చేస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: స్థానిక గజపతి స్టేడియంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని యోగా శిబిరం శనివారం ఉదయం 7.00 గంటల నుంచి ప్రారంభమవుతుందని కలెక్టర్ బిజయ కుమార్ దాస్ తెలియజేశారు. శనివారం ఉదయం 6 గంటల నుంచి 6.30 గంటల వరకు రిజిస్ట్రేషన్, యోగా భ్యాసం ప్రోటోకాల్ ప్రకారం నిర్వహించబడుతుందని తెలియజేశారు. ఈ యోగా దినోత్సవానికి పతంజలి యోగా సమితి జిల్లా ప్రభారి భీష్మేశ్వర్ దాస్ బృందం జిల్లాలో పర్లాకిమిడితో పాటు చంద్రగిరి, నువాగడ, గుమ్మా, ఆర్.ఉదయగిరిల్లో యోగా శిబిరాలు ఏర్పాటు చేస్తామని తెలియజేశారు. దీనికోసం గత నెల రోజులుగా పతంజలి యోగా సమతి సభ్యులు యోగాభ్యాసాలు చేస్తున్నారన్నారు.

మద్యం అరికట్టాలని ఫిర్యాదు



కలెక్టర్ శుభంకర్‌కు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

కొరాపుట్: తమ ప్రాంతంలో మద్యం అరికట్టాలని నబరంగ్‌పూర్ జిల్లా కలెక్టర్‌కి గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌కి చందాహండి సమితి మెహర్ గ్రామ పంచాయతీ బారిగుడ గ్రామస్తులు శుక్రవారం తరలివచ్చారు. తమ గ్రామంలో అక్రమ మ ద్యం తయారీ, విక్రయాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయని వాపోయారు. దీనివలన విద్యా ర్థులు సైతం మద్యానికి బానిసలు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై తామ ఎక్సైజ్ శాఖకి ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందన్నారు. దీనికి తగిన ఆధారాలతో కలెక్టర్ డాక్టర్ శుభంకర్ మహాపాత్రకి లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జలంధర్ మజ్జి తదితరులు ఉన్నారు.

ఆరుగురు పేకాటరాయుళ్లు అరెస్టు

గార: మండలంలోని సిలగాం గ్రామ సమీపంలో శుక్రవారం జరుగుతున్న పేకాట శిబిరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.6600 స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్‌ఐ ఎం.చిరంజీవి తెలిపారు. కాగా, పట్టుబడిన వారిలో మండలానికి చెందిన ఒక వీఆర్‌వో కూడా ఉన్నట్లు సమాచారం.

శ్రీకాకుళం రూరల్: చాపురం పంచాయతీ రామిగెడ్డ పరిసర ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం పేకాట ఆడుతుండగా 8 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నట్లు శ్రీకాకుళం రూరల్ ఎస్ఐ రాము తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.4వేలు రికవరీ చేసినట్లు చెప్పారు.

జాయింట్ పట్టాదారుల విభజనకు ప్రత్యేక డ్రైవ్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో రీసర్వే పూర్తయిన గ్రామాల్లో జాయింట్ పట్టాదారులుగా వెబ్‌ల్యాండ్-2.0లో నమోదైన రైతులు ప్రభుత్వ పథకాలు పొందడంలో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక సబ్ డివిజన్ డ్రైవ్ చేపడుతున్నట్లు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ శుక్రవారం తెలిపారు. రెవెన్యూ శాఖ సాధారణంగా వసూలు చేసే రూ.500 రుసుము మినహాయించి రూ.50 నామమాత్రపు రుసుముతో జాయింట్ పట్టాల విభజ న చేసేందుకు వీలు కల్పించామని పేర్కొన్నారు. జూన్ 30లోపు గ్రామ సచివాలయాల ద్వారా దరఖా స్తు చేసుకోవాలన్నారు. భూవివరాల విభజన అనంతరం అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, ఇతర పథకాల కోసం రైతులు అర్హులుగా పరిగణిస్తారని జేసీ స్పష్టం చేశారు. ఇప్పటికే పథకాల ప్రయోజనాలు పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న జాయింట్ పట్టాదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. అన్నదాత సుఖీభవలో అర్హత కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసినవారికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు వివరించారు. పేద రైతులకు ఇది గొప్ప అవకాశమని, జూన్ 30లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఆకట్టుకున్న భరతనాట్య ప్రదర్శన



నిషాల్‌కు స్వామివారి ప్రసాదాన్ని అందిస్తున్న శంకరశర్మ

శ్రీకాకుళం కల్చరల్: అరసవల్లి సూర్యనారాయణ స్వామి దేవాలయంలోని అనివెట్టి మండపంలో కేరళ రాష్ట్రం తిరువనంతపురానికి చెందిన ఓంకార్ అకాడమీ గురువు చిత్రా త్యాగరాజన్ శిష్యులు మండా వెంకట నిషాల్ శుక్రవారం భరతనాట్య ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ స్వామివారి ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వాహణాధికారి కె.ఎస్.వి.డి.వి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ ఏడాది పాలన పూర్తి మహోత్సవ వేదికపై భారత ప్రధాన మంత్రితో రాష్ట్ర గవర్నరు తదితర ప్రముఖులు

రాష్ట్రంలో సుపరిపాలన సంవత్సరం

- ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ



ప్రధాన మంత్రికి స్వాగతం పలికిన శాసన సభ స్పీకరు సురమా పాఢి



రోడ్డు షో కార్యక్రమంలో ప్రధాన మంత్రితో పాల్గొన్న రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి



ప్రభుత్వ భావి కార్య ప్రణాళిక సంచికని ఆవిష్కరించిన భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ

భువనేశ్వర్: రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి నేతృత్వంలో ఒడిశా సుపరిపాలన సంవత్సరం వేడుకల్ని జరుపుకుంటోందని భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రశంసించారు. రాష్ట్ర ప్రజలకు మోహన్ చరణ్ మాఝి అద్భుతమైన పాలన అందిస్తున్నారన్నారు. స్థానిక జనతా మైదానంలో ఏర్పాటు చేసిన రాష్ట్రంలో బీజేపీ పాలన తొలి ఏడాది పూర్తి వార్షికోత్సవ సభలో శుక్రవారం ప్రధాన మంత్రి ప్రసంగించారు. గత ఏడాది కాలంగా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి, ఆయన బృందం అద్భుతమైన పనితీరును ప్రదర్శించినట్లు ప్రధానమంత్రి పేర్కొన్నారు. ఈ దక్షత ఒడిశాలో సుపరిపాలన సంవత్సరంగా చరిత్రలో మిగిలిపోతుందన్నారు. తొలి ఏడాది పాలనలో రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రజా సేవతో ప్రజా ప్రభుత్వంగా ప్రజల విశ్వాసాన్ని కూడగట్టుకోవడంపై దృష్టి సారించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు.

ఒడిశా ప్రభుత్వం విజయవంతంగా ఒక సంవత్సరం పూర్తి చేసి రాష్ట్రానికి మరింత ఉజ్వలమైన, జవాబుదారీ భవిష్యత్తుకు పునాది వేసిందని ఆయన ప్రోత్సహించారు. రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని హామీలను క్రమం తప్పకుండా అమలు చేస్తుందని ప్రధాన మంత్రి ప్రసంగంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలు ప్రాజెక్టులు ప్రారంభించి రాష్ట్ర ప్రభుత్వ భావి కార్యాచరణ ప్రణాళిక సంచికని ప్రధాన మంత్రి ఆవిష్కరించారు.

2036 సంవత్సరంలో భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఒడిశా ఏర్పడి శతాబ్ది పూర్తి చేసుకునే సందర్భంగా, 2047లో భారత దేశం స్వాతంత్ర్యం సాధించి 100 ఏళ్ల పూర్తి సందర్భంగా రాష్ట్ర అభివృద్ధి లక్ష్యాలకు సంబంధించిన సమగ్ర సమాచారంతో రోడ్‌మ్యాప్ సంచిక రూపు దిద్దుకుంది. 2036 నాటికి ఒడిశాను 500 బిలియన్ల యూఎస్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 1.5 ట్రిలియన్ల యూఎస్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడం ఈ విజన్ డాక్యుమెంట్ లక్ష్యంగా పేర్కొన్నారు.

జీ 7 శిఖరాగ్ర సమావేశం సందర్భంగా కెనడా అధికారిక పర్యటన తర్వాత వాషింగ్టన్‌కు రావాలన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆహ్వానాన్ని తిరస్కరించి రాష్ట్రంలో తొలి భారతీయ జనతా పార్టీ పాలన ఏడాది పూర్తి ఉత్సవానికి హాజరైనట్లు ప్రధాన మంత్రి ప్రకటించారు. స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి రాష్ట్ర శాసన సభ స్పీకరు సురమా పాఢి ప్రధాన మంత్రికి స్వాగతం పలికారు. వార్షికోత్సవం ప్రాంగణం వరకు నిర్వహించిన రోడ్డు షో కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. వార్షికోత్సవంలో రాష్ట్ర గవర్నరు డాక్టరు హరి బాబు కంభంపాటితో పలువురు రాష్ట్ర, కేంద్ర మంత్రులు పాల్గొన్నారు.

వైభవంగా లలితాదేవి వార్షికోత్సవం



లలితాదేవి తిరువీధి ఉత్సవంలో మహిళలు



లలితా దేవికి వేదమంత్రాలు, అష్టోత్తర శతనామావళి చదువుతున్న మహిళలు



లలితాదేవి వార్షికోత్సవాన్ని జరిపిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: స్థానిక రాజవీధి పొడుగు దేవాలయంలోని లలితాదేవి వార్షికోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. పొట్నూరు గున్నయ్యశెట్టి, కుమారి దంపతులు, అందవరపు బాలజీ, సుజాత, కోట్ని హరి, పొట్నూరు హరి దంపతులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. లలితాదేవికి చండీహోమం, రాజశ్యామలాదేవి, వారాహి అమ్మవార్ల పూజలను పండితులు వనమాలి మణిశర్మ, దుర్గాప్రసాద్ దాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పట్టణంలో లలితాదేవి తిరువీధి ఉత్సవం అనంతరం సాయంత్రం అమ్మవారికి ముత్తైదువులు కుంకుమపూజలను విశాలాక్షి అయ్యంగర్ ఆధ్వర్యంలో శాస్త్రీయంగా జరిగిపారు.

మొగదాలపాడులో పూరిల్లు దగ్ధం

గార: వత్సవలస పంచాయతీ మొగదాలపాడులో గనగళ్ల లక్ష్మమ్మకు చెందిన పూరిల్లు అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో విద్యుత్ మీటరు వద్ద మంటలు చెలరేగి ఇంటి మొత్తం వ్యాపించాయని బాధితురాలు తెలిపారు. గ్రామస్తులు మంటలార్పే ప్రయత్నం చేసినా ఫలితం దక్కలేదు. శ్రీకాకుళం నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపులోకి తీసుకొచ్చారు. సుమారు రూ. 2 లక్షలు వరకు ఆస్తి నష్టం ఉంటుందని రెవెన్యూ సిబ్బంది అంచనా వేశారు.

జూలై 9న అఖిలభారత సమ్మె

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): కార్మిక హక్కులు కాలరాసే లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ప్రభుత్వ రంగ సంస్థలు పరిరక్షణ కోరుతూ కేంద్ర కార్మిక సంఘాలు పిలుపు మేరకు జూలై 9న అఖిల భారత సమ్మె జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సీహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు పిలుపునిచ్చా రు. ఈ మేరకు శుక్రవారం శ్రీకాకుళం సీఐటీ యూ జిల్లా సమావేశం కార్యాలయంలో సమ్మె పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూలై 9న అన్ని మండల కేంద్రాలలో నిరసన ప్రదర్శనలు జరుగుతాయని, కార్మికులు, స్కీం వర్కర్లు పాల్గొనాలని కో రారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు ఎం.ఆదినారాయణమూర్తి, అల్లు సత్యనారాయణ, కె.సూరయ్య, ఎస్.వి.రమణ, ఎన్.గణపతి, ఎస్.లక్ష్మీనారాయణ, శ్రీకాకుళం నగర కన్వీనర్ ఆర్.ప్రకాశ్ పాల్గొన్నారు.

రాత్రికి రాత్రి కాంగ్రెస్ కార్యకర్తలు అరెస్టు



రాజధాని పోలీస్ ఠాణాలో విద్యార్థి కాంగ్రెసు నాయకులు



ఒడిశా ప్రదేశ్ కాంగ్రెసు కమిటి సభ్యుల ధర్నా

భువనేశ్వర్: భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రాష్ట్ర పర్యటన పురస్కరించుకుని అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యలో భాగంగా కాంగ్రెసు యువజన, విద్యార్థి వర్గాల నాయకుల్ని అరెస్టు చేసి ఠాణాలో నిర్బంధించారు. ఈ చర్యకు నిరసనగా ఒడిశా ప్రదేశ్ కాంగ్రెసు కమిటి ప్రముఖులు శుక్ర వారం శాంతియుతంగా ధర్నా నిర్వహించారు. పోలీసు చర్యల్ని తీవ్రంగా ఖండించారు. పీసీసీ అధ్యక్షుడు భక్త చరణ్ దాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన శాంతియుత నిరాహార దీక్షలో, ప్రదేశ్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, స్టూడెంట్ కాంగ్రెస్, పీసీసీ కార్యకర్తలు శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిరవధికంగా నిరాహార దీక్ష చేశారు. భారత ప్రధాన మంత్రి గంజాం జిల్లా గోపాల్‌పూర్ గ్యాంగ్‌రేప్ స్థలాన్ని సందర్శించి భవిష్యత్‌లో ఇటువంటి సంఘటన పునరావృతం కాదని రాష్ట్ర ప్రజలకు హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. జాజ్‌పూర్ జిల్లాను సందర్శించి కలరా ప్రభావిత ప్రాంతం పరిస్థితిని ప్రధాన మంత్రి ప్రత్యక్షంగా సమీక్షించి ప్రభుత్వ వైఫల్యాన్ని సరిదిద్దే చర్యగా రాష్ట్ర ముఖ్యమంత్రి, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రికి నిర్దిష్ట సూచనలు జారీ చేయాలని కాంగ్రెసు ప్రముఖులు కోరారు. భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రాష్ట్ర పర్యటనకు ముందు పోలీసులు మాజీ విద్యార్థి కాంగ్రెస్ అధ్యక్షుడు, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి, భువనేశ్వర్ పార్లమెంటరీ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు యాసిర్ నవాజ్, ఇతర యువజన కాంగ్రెస్ నాయకులను అదుపులోకి తీసుకుని గురువారం రాత్రి స్థానిక రాజధాని పోలీస్ ఠాణాలో నిర్బంధించారు.

ఆశా కార్యకర్తల సమ్మె నోటీసు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఆశా కార్యకర్తలను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం రూ.26 వేలు మంజూరు చేయాలని, కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లు రద్దు చేయా లని కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు జూలై 9న జరుగుతున్న దేశవ్యాప్త సమ్మెలో అంతా పాల్గొనా లని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డి.ధనలక్ష్మి, జి.అమరావతి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సి.హెచ్.అమ్మన్నాయు డు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కె.అనితకు సమ్మె నోటీసు అందజేశారు. పేదలకు ఆరోగ్యసేవలు అందిస్తున్న తమకు కార్మికులుగా గుర్తించి సౌకర్యాలు కల్పించాల ని విన్నవించారు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా మార్చు చేయాలని, రూ.10 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని కోరారు.



డీఎంహెచ్‌ఓకు వినతిపత్రం అందిస్తున్న ఆశా, సీఐటీయూ నాయకులు

‘విశ్రాంతి గృహానికి స్థలమివ్వాలి’



సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించిన యువకులు

జయపురం: దక్షిణ ఒడిశాలో ప్రసిద్ధి చెందిన గుప్తేశ్వర్ శివ క్షేత్రంలో రాత్రులందు భక్తులు ఉండేందుకు ఒక విశ్రాంతి గృహం నిర్మించేందుకు 15 సెంట్ల స్థలం కేటాయించాలని బొయిపరిగుడ సమితి రామగిరి పంచాయతీ పూజారి పుట్, మాలిగుడ, అటల్‌గుడ, బదుడిపహాడ్, అంబొచందిలి, కలియజులి, మండుకరొఖురణ, గదబగుడ, బాగ్‌రొఖాల, పురాణ పాని, గెల్లాగుడ, మాలిపాదర్, జమేల్‌బెడ, దండకొల ఆదివాసీ యువకులు సబ్ కలెక్టర్ అక్కవరం శొశ్యారెడ్డిని కలసి విజ్ఞప్తి చేశారు. వారు సబ్ కలెక్టర్‌కు ఒక వినతి పత్రం సమర్పించారు. గుప్తేశ్వర ప్రాంతంలో చుట్టు పక్కల గ్రామాలలో నివసించే గుప్తేశ్వరుని భక్తులు రాత్రిళ్లో గుప్తేశ్వరంలో ఉంటున్నారని, వారికి ఎలాంటి సదుపాయం లేదని, విశ్రాంతి గృహానికి స్థలం కేటాయించాలని కోరారు.

విజయోత్సవ సభ వీక్షణం



వేదికపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ, సీఎం మెహన్ చరణ్, గవర్నర్ హరిబాబు



జయపూర్‌లో ప్రత్యేక ప్రసారాన్ని వీక్షిస్తున్న సబ్ కలెక్టర్ సశ్యా రెడ్డి, చైర్మన నొరి, వైస్ చైర్మన్ బి.సునీత తదితరులు

కొరాపుట్: ఏడాది కాలంలో కేంద్ర, రాష్ట్రాల్లో బీజేపీ సర్కార్లు సాధించిన విజయాలపై జయపూర్‌లో ప్రత్యేక కార్యక్రమం శుక్రవారం జరిగింది. జయనగర్ చిల్డ్రన్ పార్క్ సమీపంలో ప్రధాని నరేంద్రమదీ రాష్ట్ర రాజధానిలో జరిగిన అధికారిక కార్యక్రమాన్ని స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. స్థానికంగా ప్రభుత్వం తరపున జయపూర్ సబ్ కలెక్టర్ అక్కవరం సశ్యారెడ్డి, మున్సిపల్ చైర్మన్ నరేంద్ర మహంతి, వైస్ చైర్మన్ బి.సునీత హాజరయ్యారు. రెండో ప్రపంచ యుద్ధంలో పాల్గొన్న ఇందిరా లక్ష్మీ పండా కుటుంబాన్ని ఇదే కార్యక్రమ వేదికపై యెగా క్షేమాలు అడిగి తెలసుకున్నారు. కార్యక్రమంలో జయపూర్ ప్రజలు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ప్రకృతి వైపరీత్యాలపై అవగాహన



పిడుగులు పడే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది



క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలిస్తూ..



గాయపడిన వారిని తరలిస్తున్న సిబ్బంది

మల్కన్‌గిరి: ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులు అన్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి మోటు ప్రాంతంలో మాక్‌డ్రిల్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించి ప్రజల్లో చైతన్యం కలిగించారు. ముఖ్యంగా బాదిలి, గిరకానపల్లి, మోటు, ధుంగియాపూట్ ప్రాంతాల్లో వరద ఆశ్రయ కేంద్రాలు ఉన్నాయి. జిల్లా అదనపు కలెక్టర్ వేద్బర్ ప్రధన్, ఎమర్జెన్సీ అధికారి ప్రఫుల్ల బేహెరా గిరకానపల్లి ఆశ్రయ కేంద్రాలను సందర్శించారు. జిల్లా సబ్ కలెక్టర్ దుర్యోధన్ బోయి కూడా ఉన్నారు. ప్రకృతి విపత్తులు సంభవించే ముందు , తరువాత పరిస్థితులను దృష్టిలో ఉంచకుని ప్రజలు తమ ధన, జీవనాన్ని రక్షించుకోవడానికి, ఇతరులను సురక్షితంగా ఉంచేందుకు అగ్నిమాపక సిబ్బంది సిద్ధంగా ఉండేలా అవగాహన కల్పించారు. అగ్నిమాపిక సిబ్బంది వరదలు, తుఫాన్, మెరుపులు, గర్జన, భూకంపం, పాముకాటు సంభవించే విపత్తులపై ప్రాథమిక చికిత్స, రక్షణ పద్ధతుల ప్రదర్శణ చేశారు. విపత్తు సమయంలో గ్రామస్థాయిలో ఎలర్ట్ టీమ్, రెస్క్యూ టీమ్, నష్టఅంచనా, సహాయకేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వ అధికారులను ఆదేశించారు.

పింఛన్ కోసం మాజీ ఎమ్మెల్యే సతీమణి వినతి



మాజీ ఎమ్మెల్యే సదన నాయిక్ సతీమణి తిలోత్తమ నాయిక్, ఆమె బంధువు

జయపురం: జయపురం సబ్‌డివిజన్ కొట్‌పాడ్ మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ సదన్ నాయిక్ భార్య తిలోత్తమ నాయిక్ తనకు పింఛన్ మంజూరు చేయమని వేడుకుంటున్నారు. ఈ మేరకు కొరాపుట్ పెన్షనర్స్ అదాలత్‌ను ఆశ్రయించారు. మాజీ ఎమ్మెల్యే గత జనవరి నెలలో చనిపోయారు. బిజూ పట్నాయిక్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 1990లో కొట్‌పాడ్ నియోజక వర్గం నుంచి నాయిక్ జనతాదల్ పార్టీ అభ్యర్థిగా ఎన్నికై 1995 వరకు ఎమ్మెల్యే కొనసాగారు. అతనికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. వారిరువురు వివాహితులు. కొట్‌పాడ్ సమితిలో చిత్రగుడ లో తిలోత్తమ నాయిక్ ఉంటున్నారు. భర్త పోయిన తరువాత ఆమె ఆర్థిక పరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భర్త చనిపోయిన తరువాత పింఛన్ వస్తుందని ఆశించారు. కానీ భర్త సదన్ నాయిక్ పెన్షన్ బుక్‌లో ఆమె పేరులేక పోవటంతో సమస్య అయింది. మాజీ ఎమ్మెల్యే అయిన సదన నాయిక్ భార్యనైన తనకు పింఛన్ మంజూరు చేయాలని ఆమె ఎన్ని విజ్ఞప్తులు చేసినా ఎవరూ పట్టించుకోలేదు. రాష్ట్ర పెన్షన్ విభాగం వారు గురువారం కొరాపుట్‌లో పెన్షన్ అదాలత్ నిర్వహిస్తున్నారని తెలిసి తిలోత్తమ నాయిక్ అక్కడకు వెళ్లి లిఖిత పూర్వకంగా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆమె తన వద్దగల ఆధారాలు సమర్పించగా..అధికారులు సంతకాలు తీసుకొని రాష్ట్ర పెన్షన్ అధాలత్ విభాగానికి పంపుతామని తెలిపినట్లు ఆమె వెల్లడించారు.

ప్రభుత్వ విభాగాల సమన్వయంతోనే వికాస్ మేళా



వికాస్ మేళా ముగింపు సమావేశాన్ని ప్రారంభిస్తున్న డీఎఫ్ఓ కె.నాగరాజు



అంత్యోదయ గృహ పథకం కింద వర్క్ ఆర్డర్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు



ఉత్తమ మిషన్ శక్తి స్టాల్ గాయత్రీ (నువాగడ) కె.జలార్‌సింగికి బహుమతి ప్రదానం



ఆదివాసీ ప్రజలకు భూపట్టాల పంపిణీ



ఎస్పీ జి.ఎన్.పండాకు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న కలెక్టర్ బిజయ కుమార్ దాస్



ఆదివాసీ దివ్యాంగుల నృత్య ప్రదర్శన

పర్లాకిమిడి: జిల్లాలో అన్ని ప్రభుత్వ విభాగాల అధికారుల సమన్వయంతో ఏడురోజుల వికాస్ మేళా విజయవంతమైందని కలెక్టర్ బిజయ కుమార్ దాస్ అన్నారు. శుక్రవారం స్థానిక గజపతి స్టేడియంలో వికాస్ మేళా ముగింపు సమావేశాన్ని జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ జీఎన్ పండా, డీఆర్‌డీఏ ముఖ్యకార్యనిర్వహణ అధికారి శంకర కెరకెటా, డీఎఫ్‌ఓ కె.నాగరాజు, సబ్‌కలెక్టర్ అనుప్‌పండా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 20 మంది లబ్ధిదారులకు అటవీ భూముల పట్టాలు, మరో 22 మంది ఆదివాసీలకు ఆర్ఓఆర్ పట్టాలు, అంత్యోదయ గృహ యోజన పథకం కింద 25 మందికి వర్క్ ఆర్డర్లు పంపిణీ చేశారు.



వికాస్ మేళాలో వివిధ ప్రభుత్వశాఖల స్టాల్స్

క్లుప్తంగా

22న జాబ్‌మేళా


సీకేఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల

నెల్లిమర్ల: పట్టణంలోని సీకేఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 22న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ప్రశాంత్‌కుమార్ శుక్రవారం ఒకప్రకటనలో తెలిపారు.జిల్లా నైపుణ్యాభివృద్ధిసంస్థ, ప్రభుత్వ జూనియర్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, డిప్లమో, ఐటీఐ, బీటెక్, పీజీ విద్యార్హత కలిగిన అభ్యర్థులు జాబ్ మేళాకు హాజరుకావాలని సూచించారు.12 బహుళ జాతి కంపెనీలు మేళాలో పాల్గొంటాయన్నారు. అభ్యర్థులు తమ వివరాలను httpr://naipunyam.ap.gov.inఅనే వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని కోరారు.

సారా అమ్మకాలపై దాడులు


స్వాధీనం చేసుకున్న బైక్‌తో ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు,సిబ్బంది

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి పరిసర ప్రాంతాల్లో అక్రమంగా సారా అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం దాడులు చేశారు. ఈ దాడుల్లో 60 లీటర్ల సారాతో చినమేరంగి గ్రామానికి చెందిన వ్యక్తి పట్టుబడడంతో అదుపులోకి తీసుకున్నారు. సారా రవాణాకు ఉపయోగించిన పల్సర్‌బైక్‌ను సీజ్ చేసినట్లు సీఐ చెప్పారు. సారా సరఫరా చేస్తున్న రాయగడ జిల్లా కెరడ గ్రామానికి చెందిన వ్యక్తిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసి ఇద్దరినీ కోర్టులో హాజరు పరిచామన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల బదిలీలకు దరఖాస్తులు

పార్వతీపురం టౌన్: జిల్లా పరిధిలో సమగ్ర శిక్ష మండల స్థాయిలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్న వారు రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్ కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని సమగ్ర శిక్ష ఏపీసీఎస్ వరల్ద్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేజీబీవీ టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్, ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్స్, క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, పార్ట్ టైమ్ ఇన్‌స్ట్రక్టర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, మెసెంజర్లు, ఆఫీస్ సబార్డినేట్లు, సైట్ ఇంజినీర్లు తదితర పోస్టులకు రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. సంబంధిత మండల విద్యాశాఖాధికారి, ప్రధానోపాధ్యాయులతో కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయ సిబ్బంది సంబంధిత ప్రిన్సిపాల్‌తో కౌంటర్ సైన్ చేయించాలని సూచించారు. జిల్లా సమగ్ర శిక్షా కార్యాలయంలో ఈనెల 21 వరకు కార్యాలయం పని వేళల్లో దరఖాస్తులు అందించాలని స్పష్టం చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


పైడిరాజు మృతదేహం

విజయనగరం క్రైమ్: ఐదు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడిన విజయనగరంలోని వీటీ అగ్రహారానికి చెందిన బమ్మిడి పైడిరాజు(50) హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు విజయనగరం రూరల్ ఎస్సై అశోక్ చెప్పారు. ఈ నెల 15వ తేదీన పైడిరాజు బైక్‌పై నాతవలస వెళ్లి తిరిగి వస్తుండగా ధర్మపురి రోడ్డులో సుగర్ డౌన్ అయ్యి కళ్లు తిరిగి పడిపోయాడని ఎస్సై అశోక్ తెలిపారు. స్థానికుల సహాయంతో వైజాగ్‌లోని మెడికవర్ ఆస్పత్రిలో జాయిన్ చేయగా చికిత్స పొందుతూ మృతి చెందాడన్నారు. పైడిరాజు కుమార్తె కీర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు రూరల్ ఎస్సై తెలిపారు.

సత్య డిగ్రీ కళాశాల క్యాంపస్ డ్రైవ్‌లో 197 మందికి ఉద్యోగాలు


ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు

విజయనగరం అర్బన్: పట్టణంలోని సత్య డిగ్రీ/పీజీ కళాశాల ప్రాంగణంలో లెర్నింగ్ ట్రీ ఆర్గనైజేషన్, ఇన్ఫోసిస్ ఫౌండేషన్ సంయుక్తంగా శుక్రవారం నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో 197 మందికి ఉద్యోగాలు లభించాయి. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిదేవమణి శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. డ్రైవ్‌లో 16 కంపెనీలు పాల్గొని 492 మంది అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహించి ఎంపిక చేసినట్లు తెలిపారు. తొలుత రిటన్ టెస్ట్, తరువాత టెక్నికల్ రౌండ్, ఇంటర్వ్యూలు నిర్వహించగా ప్రతిభ చూపిన 197 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు అభినందించారు.

ఉపాధి అంతంతే..!

- వేతనదారులకు దొరకని పని
- కొన్ని గ్రామాల్లో నెల రోజులుగా నిలిచిపోయిన పనులు
- సకాలంలో జమకాని బిల్లులు
- పనికల్పనలో వెనుకబడిన అనేక మండలాలు


విజయనగరం మండలం దుప్పాడలో పనిచేస్తున్న వేతనదారులు

విజయనగరం ఫోర్ట్: గ్రామాల్లో ఉన్న వేతనదారులకు పనికల్పించి వలసలను నివారించడానికి ప్రవేశపెట్టిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఈ ఏడాది వేతనదారులకు ఉపాధి అంతంతమాత్రంగానే కల్పించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అడిగిన వారందరికీ పని కల్పించకుండా కొంతమందికి మాత్రమే పని ఇస్తున్నారని వేతనదారులు వాపోతున్నారు. గ్రామాల్లో వేతనదారులకు పూర్తిస్థాయిలో కల్పించకపోవడం, వేతనాలు తక్కువగా రావడం, అ తక్కువ వేతనాలు కూడా నెలల తరబడి అందకపోవడంతో వేతనదారులు ఉపాధి హామీ పనులకు వెళ్లడానికి ఆసక్తి చూపడం లేదు. దీనికి కొన్ని గ్రామాల్లో నెల రోజులుగా ఉపాధి పనులు నిలిపివేశారు. ఫలితంగా పనికి వెళ్దామనుకున్నా వేతనదారులకు పని దొరకని పరిస్థితి.

మళ్లీ వలసబాట

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం రాక ముందు పనుల కోసం గ్రామీణ ప్రాంత ప్రజలు చెన్నై, హైదరాబాద్, బెంగళూరు వంటి ప్రాంతాలకు పనుల కోసం వెళ్లేవారు. అటువంటి వారికి సొంత గ్రామాల్లో పనులు కల్పించడం కోసం ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టారు. అయితే గ్రామాల నుంచి మళ్లీ పనుల కోసం వేతనదారులు పలుప్రాంతాలకు వలస వెళ్తున్నట్లు సమాచారం.

పనికల్పనలో వెనుకబడిన మండలాలు

జిల్లాలోని అనేక మండలాలు వేతనదారులకు పని కల్పించడంలో వెనుకబడ్డాయి. కొన్ని మండలాల్లో లక్ష్యంలో సగం కూడా పని కల్పించలేదు. 12 మండలాలు పనికల్పనలో వెనుకబడ్డాయి. వాటిలో వేపాడ, జామి, తెర్లాం, డెంకాడ, రామభద్రపురం, ఎల్.కోట, గుర్ల, ఎస్.కోట, బొండపల్లి, వంగర, గరివిడి, సంతకవిటి, తదితర మండలాలు ఉన్నాయి.

మూడు నెలల్లో పనిదినాల లక్ష్యం 1.33 కోట్లు

2025-26 సంవత్సరానికి సంబంధించి ఏప్రిల్, మే, జూన్ నెలల పనిదినాల లక్ష్యం 1.33 కోట్లు. కాగా జూన్ 18 నాటికి 95.03 లక్షలు మాత్రమే కల్పించారు. 38.55 లక్షల పనిదినాలు కల్పించాల్సి ఉంది.

సకాలంలో అందని బిల్లులు

ఉపాధి హామీ పథకంలో భాగంగా పనికి వెళ్లే వేతనదారులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పనిచేసిన వారం రోజుల్లో డబ్బులు జమ అయ్యేవి. కానీ కూటమి ప్రభుత్వం హయాంలో వేతనాలు సకాలంలో పడడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పనిచేసిన రెండు, మూడు నెలల వరకు బిల్లులు పడడం లేదని వేతనదారులు వాపోతున్నారు. ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్, మే నెలలకు సంబంధించి వేతనాలు సకాలంలో వేతనదారులకు అందలేదు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధిహామీ పథకంలో పనిచేసే వారంతా పేదవారే. పనికి వెళ్తే వచ్చే ఆదాయం ద్వారా కుటుంబ పోషణ చేస్తారు. సకాలంలో వేతనాలు అందకపోవడం వల్ల ఉపాధి పనులు వదిలి ఇండ్ల పనులు, ఇటుక బట్టీ పనులకు వెళ్తున్నారు. ఉపాధి పనులు పూర్తి స్థాయిలో కల్పించకపోవడం వల్ల వేతనదారులకు ఉపాధి దొరకని పరిస్థితి నెలకొందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

జిల్లాలో వివిధ మండలాల్లో ఏప్రిల్‌నుంచి జూన్18 వరకు పనిదినాల లక్ష్యం, కల్పించిన పనిదినాలు

మండలం	పనిదినాల లక్ష్యం	కల్పించిన పనిదినాలు
విజయనగరం	3,81,389	2,88976
బాడంగి	4,11659	3,10,489
గంట్యాడ	5,98, 127	4,44,735
గజపతినగరం	5,37,267	3,85, 757
రాజాం	3,77,985	2,76, 417
దత్తిరాజేరు	4,26,425	3,11347
భోగాపురం	4,04,446	3,92,243
సంతకవిటి	5,41,409	3,91,204
గరివిడి	6,63,143	4,75,957
వంగర	3,12,230	2,19,234
బొండపల్లి	4,37,235	3,02,711
ఎస్.కోట	5,61,909	3,83,629
గుర్ల	7,53,883	4,94,299
ఎల్.కోట	5,62,375	3,44628
రామభద్రపురం	4,15,944	2,47,249
డెంకాడ	4,34,729	2,48,656
తెర్లాం	5,29,719	2,94,624
జామి	4,25,626	2,16,745
వేపాడ	4,98,450	2,42308

శతశాతం లక్ష్యం సాధించేందుకు కృషి

ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి నిర్దేశించిన లక్ష్యాన్ని శతశాతం సాధించేందుకు చర్యలు తీసుకుంటాం. ఏప్రిల్ నుంచి జూన్ నెలాఖరు నాటికి పనిదినాల లక్ష్యం 1.33 కోట్లు కాగా జూన్ 18 నాటికి 95.03 లక్షల పనిదినాలు కల్పించాం.

ఎస్. శారదదేవి, పీడీ, డ్వామా

నిరుద్యోగులు, విద్యార్థులకు అండగా నిలవండి


జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలుపుతున్న హరీష్ తదితరులు


మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండకు కృతజ్ఞతలు తెలుపుతున్న నాయకులు

భోగాపురం: కూటమి ప్రభుత్వంలో నిరుద్యోగులు, విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని వారికి అండగా నిలబడాలని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడులు సూచించారు. ఈ మేరకు భోగాపురానికి చెందిన సుందర హరీష్ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శిగా నియమితులైన సందర్భంగా శుక్రవారం జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుతో పాటు మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడులను వారి నివాసాల్లో మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు విద్యార్థులు, యువతకు కూటమి ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చి మభ్యపెట్టి అధికారంలోకి వచ్చాక మోసం చేసిందని దుయ్యబట్టారు. ఏడాది అవుతున్నా నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి లేదని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించలేదన్నారు. విద్యార్థులకు ఫీజు రియింబర్స్‌మెంట్ విడుదల చేయలేదని విమర్శించారు. జగనన్న ప్రభుత్వంలో విద్యార్థుల అభ్యున్నతికి ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారని గుర్తుచేశారు. వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. అనంతరం పార్టీ మండల అధ్యక్షుడు ఉప్పాడ సూర్యనారాయణరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో నాయకులు గోపి, బంగారాజు, వెంకన్న, ప్రసాద్, శ్రీను, సాయిరాం, భాస్కరరావు, మాధవ, అప్పారావు, గురువులు, తదితరులు పాల్గొన్నారు.

సంగీత, నృత్య కళాశాలలో ప్రవేశాలకు ఆహ్వానం


మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల, విజయనగరం

విజయనగరం టౌన్: మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కేవీఎల్ఎన్. శాస్త్రి శుక్రవారం కళాశాల కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో తెలిపారు. నాలుగేళ్ల సర్టిఫికెట్ కోర్సుతో పాటు రెండేళ్ల డిప్లమో కోర్సులో శిక్షణ ఉంటుందన్నారు. సర్టిఫికెట్ కోర్సుల్లో ఉత్తీర్ణులైన వారు మాత్రమే డిప్లమో కోర్సుల్లో చేరేందుకు అర్హులన్నారు. కళాశాలలో గాత్రం, వీణ, వయోలిన్, నాదస్వరం, మృదంగం, డోలు, భరతనాట్యం కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నామని, అభ్యర్థుల వయస్సు 10 ఏళ్ల నుండి 60 ఏళ్లలోపు ఉండాలన్నారు. దరఖాస్తులను కళాశాల సమయవేళల్లో అందజేయాలని సూచించారు. ఆసక్తి గల విద్యార్థులు ఫోన్ 08922-223751 నంబర్‌లో కానీ నేరుగా కళాశాలలో గానీ సంప్రదించాలని కోరారు.

కొప్పుల వెలమ సంక్షేమ సంఘం సమావేశం రేపు

పార్వతీపురం: పార్వతీపురం పట్టణంలోని సీఎస్ఎన్ వేదికలో ఆదివారం సాయంత్రం 4గంటలకు కొప్పుల వెలమ సంక్షేమసంఘ సమావేశం నిర్వహిస్తున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా కొప్పుల వెలమ సంక్షేమసంఘం సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్ర కొప్పుల వెలమ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ టీవీజీ కుమార్ హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి పార్వతీపురం, కురుపాం నియోజకవర్గాలకు చెందిన కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్లు, మేధావులు హాజరై సంఘం అభివృద్ధికి సలహాలు, సూచనలు ఇవ్వాలని ప్రకటనలో తెలిపారు.

ఘనంగా రెవెన్యూ దినోత్సవం



ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

- రిటైర్డ్ అధికారులకు సత్కారం

విజయనగరం అర్బన్: రెవెన్యూ అధికారులు చట్టాలపై అవగాహన కల్పించుకుని ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. రిటైర్ అయిన ఉద్యోగుల అనుభవాలను తెలుసుకుని సమర్థతను పెంచుకోవాలని సూచించారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో జరిగిన రెవెన్యూ దినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం సిబ్బంది, అధికారులతో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. రెవెన్యూ శాఖలో రిటైర్ అయిన అటెండర్ నుంచి డిప్యూటీ కలెక్టర్ వరకు పలువురిని ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీఆర్ఓ శ్రీనివాసమూర్తి, ఆర్డీఓలు ఆశయ్య, రామ్‌మోహన్‌రావు, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ బాలాత్రిపుర సుందరి, రిటైర్డ్ డీఆర్ఓ గణపతిరావు, రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.గోవింద, సూర్యనారాయణ, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

తెట్టంగి ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్

గుర్ల: మండలంలోని తెట్టంగి ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ దన్నాన కృష్ణపై జిల్లా ఉపాధి హామీ అధికారులు సస్పెన్షన్ విధించినట్లు ఏపీఓ రత్నమాల శుక్రవారం తెలిపారు. గ్రామంలో ఈ ఏడాది వేతనదారులకు ఉపాధి హామీ పనులు కల్పించడంలో నిర్లక్ష్య ధోరణి అవలంబించడంతో సస్పెన్షన్ విధించారన్నారు. రాజకీయ కారణాలతోనే ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగిస్తున్నట్లు గ్రామంలో చర్చ జరుగుతోంది.

రెవెన్యూ ప్రతిష్టను పెంపొందించాలి

- కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురంటౌన్: జిల్లా ప్రజలకు అందిస్తున్న రెవెన్యూ సేవలతో ఆ శాఖ ప్రతిష్ట మరింత పెంపొందాలని, ఆ దిశగా రెవెన్యూ శాఖాధికారులు, ఉద్యోగులు కృషిచేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పిలుపునిచ్చారు. గ్రామ రెవెన్యూ అధికారి నుంచి తహసీల్దార్ వరకు అందరూ నిబద్ధతతో పనిచేసి ప్రజలకు, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో రెవెన్యూ దినోత్సవాన్ని ఆ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. ప్రభుత్వ శాఖల్లో అన్ని శాఖల కంటే రెవెన్యూ శాఖ చాలా కీలకమైనదని, ఒక్కోసారి 24/7 విధులు నిర్వర్తించవలసి ఉంటుందన్నారు. ఎన్నికలు, ప్రకృతి వైపరీత్యాలు, భూసేకరణ, వివిధ రకాల పత్రాల జారీ, ప్రభుత్వ పథకాల అమలు వంటివి ప్రజలకు అందించాల్సిన అన్ని సేవలు రెవెన్యూ శాఖతో ముడిపడి ఉన్నాయన్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో తమ ప్రాణాలను పణంగా పెట్టి విధులను నిర్వర్తించవలసి ఉంటుందని, తమ క్షేమాన్ని ఆశించకుండా ప్రజల కోసం నిస్వార్థగా నిబద్ధతతో పనిచేసే శాఖ రెవెన్యూ మాత్రమేనని కొనియాడారు.

పనిచేయడంలో ప్రణాళిక ఉండాలి..

రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు పనిచేయడంలో ప్రణాళిక ఉండాలని, బాధ్యతగా చేస్తే మరింత మెరుగైన సేవలు అందించవచ్చని కలెక్టర్ హితవు పలికారు. రాబోయే రోజుల్లో ప్రతి పని డిజిటలైజేషన్ అవుతుందని, కావున ప్రతి ఉద్యోగి నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని సూచించారు. ఆన్‌లైన్ ద్వారా సేవలు అందించడం వల్ల పారదర్శకత ఉంటుందని, అదేవిధంగా ప్రపంచంలో ఎక్కడి నుంచైనా వివరాలను తెలుసుకునే సౌలభ్యం ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం విశ్రాంత రెవెన్యూ ఉద్యోగులకు దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. కె.చుక్కా అలియాస్ కోనేరు అప్పారావుకు బాండెడ్ లేబర్ చట్టం ప్రకారం చెక్కును అందజేశారు.

ప్రజలతో మమేకం కావాలి..

కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత మాట్లాడుతూ కుటుంబ శ్రేయస్సును వదిలి, విధి నిర్వహణలో పూర్తిగా నిమగ్నమైన ఉద్యోగులు రెవెన్యూ ఉద్యోగులని కొనియాడారు. అన్నిసేవలు అందిస్తున్న రెవెన్యూ శాఖను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని, ప్రజలతో మమేకం కావాలని పిలుపునిచ్చారు. ప్రజలకు అందించే సేవల ద్వారా వారి మన్ననలను పొందాలని హితవు పలికారు. ఉత్తమ సేవలు అందించడం ద్వారా రెవెన్యూ ప్రతిష్ట మరింత పెరుగుతుందని, ఆ దిశగా అధికారులు, సిబ్బంది కృషిచేయాలని కోరారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ ఉపాధ్యక్షుడు శ్రీరామమూర్తి, జిల్లా గ్రామ రెవెన్యూ సంఘం అధ్యక్షుడు సింహాచలం నాయుడు, కలెక్టర్ కార్యాలయం పరిపాలన అధికారి సీహెచ్, రాధా కృష్ణమూర్తి తదితరులు రెవెన్యూ శాఖ అందిస్తున్న సేవలను గుర్తుచేశారు. సాంకేతిక పరిజ్ఞానంతో భవిష్యత్తులో వేగవంతంగా మరిన్ని సేవలు అందించేలా కృషిచేస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో ఉపకలెక్టర్లు, తహసీల్దార్లు, ఉపతహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మారిక విద్యార్థుల సమస్యలు తీరవా?

- పాఠశాలకు భవనం లేక చెట్ల కిందనే తరగతులు
- చర్చి వరండాలో మధ్యాహ్న భోజనం


చర్చి వరండాలో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు


చెట్టు కిందనే పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు రాంబాబు

వేపాడ: మండలంలోని కరకవలస పంచాయతీలో ఎత్తైన గిరిశిఖరంపై ఉన్న మారిక గిరిజన గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఉన్నా భవనం లేకపోవడంతో చెట్టుకిందనే పాఠాలు చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉపాధ్యాయుల బదిలీ ప్రకియలో బదిలీపై మారిక పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయుల విద్యా బోధనపై గిరిజనులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అయితే కొత్తమారిక, పాతమారిక తండాలకు సంబంధించి 27 మంది పిల్లలకు భవనం లేకపోవడంతో ఉపాధ్యాయులు చెట్ల కిందనే పాఠాలు బోధించాల్సిన పరిస్థితి ఏర్పడింది. చర్చి వరండాలో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకంలో భోజనాలు పెట్టినట్లు ఉపాధ్యాయుడు రాంబాబు తెలిపారు. అలాగే ఎస్ఎంఎస్ సభ్యులతో కిచెన్ గార్డెన్‌తయారు చేయించడం ప్రారంభించారు. గిరిజన విద్యార్థులకు మంచి బోధన అందించాలన్న తపనతో కృషి చేస్తున్న ఉపాధ్యాయులు విద్యార్థులకు కనీస సౌకర్యాలైన పాఠశాల పక్కాభవనం, మౌలిక వసతులు కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.


ఘాట్ రోడ్డులో వ్యాన్ బోల్తా

- సంఘటన స్థలంలో కూలీల్లో ఇద్దరు మృతి
- మరో ఏడుగురికి తీవ్ర గాయాలు
- అంటాబొంగు ఘాట్ ఎక్కలేక అదుపు తప్పడంతో ప్రమాదం
- క్షతగాత్రులకు ముంచంగిపుట్టు సీహెచ్ సీలో వైద్య సేవలు


సంఘటన స్థలంలో శివ, రమణ మృతదేహాలు

ముంచంగిపుట్టు (అల్లూరి సీతారామరాజు జిల్లా): మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ అంటాబొంగు ఘాట్‌లో శుక్రవారం సాయంత్రం వ్యాన్ బోల్తా పడిన సంఘటనలో ఇద్దరు మృతి చెందారు. ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మండలం గుమ్మడం గ్రామానికి చెందిన వంగపండు తిరుపతి అనే మేస్త్రి మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ సుత్తిగూడ గ్రామంలో సెంట్రింగ్ సామాన్లు కొనుగోలు చేశాడు. వీటిని తీసుకువెళ్లేందుకు గుమ్మడం గ్రామానికి చెందిన 10 మంది కూలీలతో వ్యాన్‌లో వచ్చాడు. అక్కడి మెటీరియల్‌ను తీసుకువెళ్తుండగా అంటాబొంగు ఘాట్ వద్దకు వచ్చే సరికి ప్రమాదానికి గురైంది. ఘాట్ ఎక్కలేక వ్యాన్ వెనక్కి వచ్చేసింది. దీనిని గమనించిన డ్రైవర్ బయటకు దూకేసి పారిపోయాడు. దీంతో వ్యాన్ అదుపు తప్పి లోయలోకి దూసుకుపోయి బోల్తా పడింది. సెంట్రింగ్ సామాన్లు వ్యాన్‌లో ఉన్న కూలీలపై పడిపోయాయి. ఈ ఘటనను చూసిన స్థానికులు హుటాహుటిన వచ్చి గాయపడిన వారిని బయటకు తీశారు. సంఘటన స్థలంలో కూలీల్లో సింగరాపు శివ(39), సింగరాపు రమణ (45) మృతి చెందారు. తీవ్ర గాయాలతో ఉన్న వద్ద గణపతి (33), దవరసింగి కుమార్ (35), సింగరాపు రమేష్ (34), నారపాటి బాబురావు (45), నారపాటి భాస్కరరావు (42), వంగపండు తిరుపతి (39), సింగరాపు శంకరరావు (38)ను ప్రైవేట్ వాహనంలో స్థానిక సీహెచ్‌సీకి తీసుకువచ్చారు. స్థానిక వైద్యాధికారి వివేక్, సిబ్బంది వారికి వైద్య సేవలు అందించారు. వీరిలో పరిస్థితి విషమంగా ఉన్న కొంతమందిని పాడేరు జిల్లా ఆస్పత్రికి పంపిస్తామని వారు తెలిపారు. ప్రమాదం సమాచారం తెలుసుకున్న స్థానిక ఎస్ఐ జె.రామకృష్ణ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాద సమాచారాన్ని బాధిత కుటుంబాలకు ఫోన్లో తెలియజేశారు. ఇద్దరు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలిస్తామని ఆయన పేర్కొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని లిమ్కాబుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ హోల్డర్, ప్రముఖ చిత్రకారిణి సిరిపురపు ప్రవల్లికా నారాయణ్ వేసిన చిత్రం అందరినీ ఆకట్టుకుంటోంది. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, వివిధ యోగాసనాలతో ఇంటర్నేషనల్ యోగాడే అని వేసిన చిత్రం అబ్బురపరుస్తోంది. - విజయనగరం టౌన్

విజిటర్స్ చాంబర్ తొలగింపుపై నిరసన



మున్సిపల్ కార్యాలయంలో ఉండే చైర్మన్, వివిధ విభాగాలకు చెందిన అధికారులను కలిసేందుకు సందర్శకులు, కౌన్సిలర్లు, పాత్రికేయులు వేచిఉండే విజిటర్స్ చాంబర్‌ను తొలగించడం అన్యాయమని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్‌నాయుడు అన్నారు. శుక్రవారం ఉదయం ఆయనతో పాటు వైస్ చైర్మన్ గొలగాని రమాదేవి, కౌన్సిలర్లు కలిసి మున్సిపల్ కార్యాలయ భవనం పోర్టికో వద్ద కూర్చుని నిరసన తెలిపారు. అడ్డగోలు అవిశ్వాసంతో చైర్మన్ పీఠాన్ని దక్కించుకున్న కూటమి నాయకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. వర్క్ఆర్డర్ లేకుండా రూ.5 లక్షలతో చైర్మన్ చాంబర్‌ను ఆధునీకరణ పనులు చేస్తున్న నాయకులు, సందర్శకులు కూర్చునే కుర్చీలను తొలగించడం అన్యాయమన్నారు. దీనిని పట్టణ ప్రజలు గమనిస్తున్నారన్న విషయం గుర్తెరగాలన్నారు. - బొబ్బిలి